సాక్షి
మంచిర్యాల

బుధవారం । 8 । నవంబర్ । 2023

I



'హస్త'గతమెప్పుడో ! IIలో▸

పాత ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి మూడు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం కరువైంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ పొత్తుతో కాంగ్రెస్ బరిలోకి దిగింది.



'పది'ంతల ప్రణాళిక IIలో▸

'పది' ఫలితాల కోసం విద్యాశాఖ చర్యలు చేపట్టింది. డిసెంబర్ 30వరకు ప్రత్యేక తరగతులకు కాలపట్టిక విడుదల చేసింది. విద్యార్థుల అల్పాహారంపై స్పష్టత కరువైంది.

గరిష్టం/కనిష్టం
33.0 /22.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. తూర్పు దిశగా చలిగాలులు వీస్తాయి. చలిమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

చెన్నూర్ బీజేపీ అభ్యర్థిగా దుర్గం అశోక్



కిషన్‌రెడ్డితో బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్

చెన్నూర్: చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా దుర్గం అశోక్‌ను ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అభ్యర్థుల ప్రకటన విడుదల చేశారు. అశోక్ 2001 డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికై వేమనపల్లి మండలం లింగాల, జైపూర్ మండలం పౌనూర్, సెట్‌పల్లి గ్రామాల్లో విధులు నిర్వర్తించారు. నేతకాని సామాజికవర్గ అభ్యున్నతి కోసం ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనంతరం నేతకాని హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో గత 10 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అశోక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నేతకాని కులస్తులు అధికంగా ఉన్నారని, అన్ని వర్గాలకు సేవ చేయడంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేయాలి



పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్, మోతీలాల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి పరిశీలించారు. ఓట్ల లెక్కింపు టేబుళ్లు, చుట్టూ కంచెలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈవీఎం, వీవీపాట్‌లను భద్రపర్చేలా చేపట్టాల్సిన స్ట్రాంగ్ రూం ఏర్పాట్లు, గదుల పనులను పర్యవేక్షించారు. 30న ఎన్నికలు, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని, 5వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని అన్నారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ స్వామిరాజ్, ఏఈ కామేశ్వర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నాలుగో రోజు మూడు నామినేషన్లు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రాజలక్ష్మి

మంచిర్యాలఅగ్రికల్చర్/చెన్నూర్/బెల్లంపల్లి: జిల్లాలోని అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాలుగో రోజు మంగళవారం మూడు నామి నేషన్లు దాఖలయ్యాయి. మంచిర్యాల నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ తరఫున ఆయన తల్లి రాజలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. కాగా, ఇప్పటివరకు ఐదుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు వేసినట్లు మంచిర్యాల రిటర్నింగ్ అధికారి రాములు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. కొందరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాలు తీసుకెళ్లారు.

చెన్నూర్‌లో

చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి సిడాం దత్తు తెలిపారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా నందిపాటి రాజు, స్వతంత్ర అభ్యర్థిగా గవ్వల శ్రీకాంత్ నామినేషన్ వేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా, ఈ నెల 9న అన్ని నియోజకవర్గాల్లో నామినేషన్ల దాఖలుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

భవిత కేంద్రం సందర్శన

నస్పూర్: పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రాన్ని సెక్టోరియల్ అధికారి కే.చౌదరి మంగళవారం సందర్శించారు. ఫిజియోథెరపీ క్యాంప్, రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. భవిత కేంద్రంలో ప్రతీ మంగళవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తామని, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సెక్టోరియల్ అధికారి-1 శ్రీనివాస్, అధికారులు ఎస్.శ్రీకర్, బీ.రాములు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కేసీఆర్



మాట్లాడుతున్న బాల్క సుమన్, వేదికపై ఎమ్మెల్యేలు చిన్నయ్య, దివాకర్‌రావు, ఎంపీ వెంకటేశ్‌నేత, మధుసూదనాచారి, ఎమ్మెల్సీ దండె విఠల్, అరవింద్‌రెడ్డి

> సుమన్ నా ఇంటి బిడ్డ. ఇక్కడ మీకు, పార్టీలో మాకు సేవ చేస్తుండు. హైదరాబాద్‌కు వస్తే మా ఇంట్లోనే ఉంటడు. ఎంతో అభివృద్ధి చేస్తుండు. సూటుకేసులతో వచ్చే వారిని గెలిపించుకుంటారా..? సుమన్‌ను గెలిపించుకుంటారా..? మీరే ఆలోచించుకోండి.
> –సీఎం కేసీఆర్

గులాబీ శ్రేణుల్లో జోష్

- బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం
- విచక్షణతో ఓటు వేయాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్
- అభివృద్ధి వివరించి, ఓట్లు అడిగిన బాల్క సుమన్
- అర్రాస్ పాటలో లీడర్లను కొంటున్నారని విమర్శలు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణం సింగరేణి హైస్కూల్ మైదానంలో మంగళవారం అధికార బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన చెన్నూర్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. సీఎం కేసీఆర్ ప్రసంగం 'గులాబీ' శ్రేణుల్లో జోష్ నింపింది. స్థానిక ఎమ్మెల్యే, చెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు నియోజకవర్గంతోపాటు జిల్లా నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలిరావడంతో పట్టణమంతా గులాబీమయమైంది. ఎక్కడ చూసినా గులాబీ జెండాలే దర్శనమిచ్చాయి. డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ.. బతుకమ్మలు, బోనాలు ఎత్తుకుని జనం సభాస్థలికి చేరుకున్నారు. గాయకులు మిట్టపెల్లి సురేందర్, మధుప్రియ బృందం సభలో పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

సింగరేణిలో సమస్యలపై హామీలు

మందమర్రి మున్సిపాలిటీ ఏజెన్సీ సమస్య తొలగించి, ఎన్నికలు జరిగేలా చూడడం, సింగరేణి ఉద్యోగులకు పెర్క్స్‌టాక్స్ యాజమాన్యమే చెల్లించే విధానం, ఖాళీ క్వార్టర్లను రిటైర్డ్ ఉద్యోగులకు, ఇళ్లు కట్టుకున్న వారందరికీ పట్టాలు ఇప్పించాలని బాల్క సుమన్ కోరారు. మందమర్రి, ఆర్కేపీ ప్రాంతాలకు 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెన్నూరులో పీజీ కాలేజీ మంజూరు చేయించాలని, లెదర్‌పార్క్‌కు నిధులు కేటాయించి ప్రారంభించాలని, కాళేశ్వరం బ్యాక్ వాటర్ రాకుండా కరకట్ట నిర్మించాలని లేకుంటే నష్టపోతున్న రైతులకు నష్ట పరిహారం కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ ప్రాంతంలో చైతన్యం ఎక్కువ

సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభంలో సింగరేణి ప్రాంతం ఎంతో చైతన్యవంతమైందని ఈ ప్రాంత గొప్ప తనాన్ని గుర్తు చేశారు. ఇక్కడ ఎన్నో ఉద్యమాలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని కోరారు. పలుమార్లు దళితబంధు, ఉచిత కరెంట్, రైతుబంధు, ధరణి పోర్టల్ ఉండలా వద్దా? అంటూ సభికులను ప్రశ్నించారు. ఈ పథకాలు కొనసాగించాలంటే చేయెత్తి చెప్పాలని కోరగా అందరూ కొనసాగించాలని చెతేత్తి సమాధానం ఇచ్చారు.

పార్టీలో చేరిన 'బోడ', రాజారమేశ్

ప్రజా ఆశీర్వాద సభలో మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు బోడ జనార్దన్, డాక్టర్ రాజారమేష్, బీజేపీ నాయకులు పత్తి శ్రీనివాస్, దుర్గం నగేశ్‌కు వేదికపై సీఎం కేసీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సభకు పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీలు దండే విఠల్, మధుసూదనాచారి, రఘోత్తమ్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగెర్ల మల్లయ్య, పట్టణ, గ్రామ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి జనార్దన్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేసీఆర్



సభకు హాజరైన జనం



బతుకమ్మలతో సభకు వస్తున్న మహిళలు

రెండున్నర గంటల ఆలస్యం..

సీఎం సభ షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12గంటల వరకు ప్రారంభం కావాల్సి ఉండగా.. 2.20గంటలకు సీఎం చేరుకున్నారు. జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో హెలిప్యాడ్ నుంచి ప్రత్యేక బస్సులో వేదిక వద్దకు తరలివచ్చారు. అప్పటికే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ జనంతో కిక్కిరిసిపోయింది. అప్పటి వరకు కళాకారులు ఆటపాటలతో హుషారెత్తించారు. సభికుల్లో జోష్ నింపారు. ప్రజా ఆశీర్వాద సభకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగుండం సీపీ రెమారాజేశ్వరి, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీలు మోహన్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సదయ్య, సీఐ, ఎస్సైలు, సిబ్బందితో ఎక్కడికక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

'గడ్డం' సోదరులపై ధ్వజం

స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ సభలో మాట్లాడుతూ.. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో రూ.కోట్లు ముట్టజెప్పి టికెట్లు తెచ్చుకున్నారని మండిపడ్డారు. అర్రాస్ పాట లెక్క ఇక్కడి లీడర్లను కొంటున్నారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గంలో 22 బ్రిడ్జిల నిర్మాణం, చెన్నూరు, క్యాతనపల్లి, మందమర్రి పట్టణాల్లో వీధి దీపాలు, అర్బన్‌పార్కులు, ఇళ్ల పట్టాల పంపిణీ, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇలా ఎంతో అభివృద్ధి చేశానని అన్నారు. ఇక్కడ పని చేసిన మాజీ ఎంపీ వివేక్ నాన్న, అన్నయ్య, ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. ఊసరవెల్లిలా రంగులు మార్చినట్లు పార్టీ మార్చి ఓట్ల కోసం వచ్చే నాయకులను నమ్మవద్దని, రూ.కోట్లాది నిధులతో అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని సుమన్ అభ్యర్థించారు. తమను జైల్లో పెడుతామంటున్న నాయకులు ఇక్కడ అభివృద్ధి చేసినందుకు పెడతారా? అంటూ మండిపడ్డారు.

నియమావళి ఉల్లంఘనపై అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: నియోజకవర్గాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల, పోలీసు అధికారులతో ఎన్నికల నిర్వహణ, ప్రవర్తన నియమావళి అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. నోడల్ అధికారులు రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలను నిశితంగా పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం నిర్వహించినా, సామాజిక మాధ్యమాల్లో అనుకూల పోస్టులు పెట్టినా శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించారు.

ఓటింగ్ శాతం పెంచాలి

ఈ నెల 15న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామని, ఆ రోజు అభ్యర్థులకు ఓటరు జాబితాలు అందించాలని, రిటర్నింగ్ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న ఓటరు నమోదు ఫారాలను త్వరితగతిన పరిష్కరించాలని వికాస్‌రాజ్ అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్ స్లిప్పులు పంపిణీ, జిల్లాలో పోలింగ్ శాతం పెంపొందే విధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు

- ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి బి.శేషాద్రి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి పౌరసరఫరాల, వ్యవసాయ, ఆదాయ పన్ను, వ్యవసాయ శాఖల అధికారులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో 2023–24 వానాకాలం వరిధాన్యం కొనుగోలు, మద్దతు ధర చెల్లింపుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ మాట్లాడుతూ ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మద్దతు ధర పొందాలంటే కేంద్ర ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. కనీస మద్దతు ధర, ఇతర ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1967, లేదా 1800 425 0033 నంబరులో సంప్రదించాలని తెలిపారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో నగదు జమ చేసే విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం వరిధాన్యం కొనుగోలుకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

నేడు బెల్లంపల్లికి కేసీఆర్

- ప్రజా ఆశీర్వాద సభకు సర్వం సిద్ధం
- విజయవంతానికి బీఆర్‌ఎస్ అభ్యర్థి చిన్నయ్య ప్రయత్నాలు
- పోలీసుల భారీ బందోబస్తు



తిలక్‌స్టేడియంలో సిద్ధం చేస్తున్న సభా వేదిక

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు బుధవారం బెల్లంపల్లికి రానున్నారు. స్థానిక పాత బస్టాండ్ ఏరియా సింగరేణి తిలక్ స్టేడియంలో జరిగే బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. బీఆర్‌ఎస్ బెల్లంపల్లి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో సభకు సర్వం సిద్ధం చేశారు. గత నాలుగు రోజుల నుంచి సభ ఏర్పాట్లు చేస్తుండగా.. సభా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. సభకు హాజరయ్యే ప్రజలకు కుర్చీలు తెప్పించారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. పోలీసు యంత్రాంగం భారీ భద్రత ఏర్పాట్లు చేసింది. హెలికాప్టర్ ద్వారా సీఎం నేరుగా తిలక్ స్టేడియంలో దిగుతారు. ఇందుకోసం ప్రత్యేకంగా పోలీసు అధికారులు స్టేడియం ఆవరణలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. రెండ్రోజుల క్రితమే రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, బెల్లంపల్లి, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు పంతాటి సదయ్య, తిరుపతిరెడ్డి, మోహన్ మైదానాన్ని సందర్శించి సభ ఏర్పాట్లు, బందోబస్తు చర్యలపై చర్చించారు. కాగా సీఎం కేసీఆర్ సమక్షంలో ఎంసీపీఐ(యూ), సీపీఐ నుంచి పలువురు బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు.

భారీగా జన సమీకరణపై దృష్టి

కేసీఆర్ సభ విజయవంతంపై ఎమ్మెల్యే చిన్నయ్య, బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించారు. అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీ నుంచి జన సమీకరణకు కార్యాచరణ తయారు చేశారు. ప్రజలను సభకు తరలించే బాధ్యతలను ద్వితీయ శ్రేణి నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల పార్టీ బాధ్యులకు అప్పగించారు. మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పార్టీ వార్డు కమిటీ బాధ్యులను భాగస్వాములను చేశారు. 10 వేల మందికి తగ్గకుండా జనాన్ని తరలించాలనే తలంపులో నిమగ్నమయ్యారు.

అందరిచూపు సభ పైనే ..

సీఎం కేసీఆర్ సభపై ప్రజల దృష్టంతా మళ్లింది. ఎన్నికల వేళ నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి హామీలు ఇస్తారనే ఆసక్తితో ఉన్నారు. 2018లో జరిగిన ఎన్నికల సభలో ఇళ్లపట్టాల సమస్య తీరుస్తామని, ఇంజినీరింగ్, పీజీ విద్యాలయాలు మంజూరు చేస్తామని ప్రకటించారు. వీటిలో ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో ఇంకా అనేకమందికి ఇళ్లపట్టాలు అందకుండా ఆగిపోయాయి. బెల్లంపల్లి కేంద్రంగా రెండు ఐటీ కంపెనీలు నడుస్తున్నాయి. కొత్తగా ఐటీ కంపెనీల విస్తరణకు సీఎం భరోసా ఇచ్చే అవకాశాలు ఉంటాయని బీఆర్‌ఎస్ శ్రేణులు ఆశిస్తున్నారు. 355 ఎకరాల్లో స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు భూమి పూజ జరగడం తదితర ప్రాధాన్యత అంశాలపై సీఎం వరాల జల్లులు కురిపిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

9న కేవీకేలో కిసాన్ మేళా

బెల్లంపల్లి: ఈ నెల 9న బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ పత్తి పరిశోధన సంస్థ నాగపూర్, బెల్లంపల్లి కేవీకే, వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధన సంస్థ అటారి(జోన్-10) సంయుక్త ఆధ్వర్యంలో మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పత్తి ఉత్పాదకతను పెంచే అధిక సాంద్రత పద్ధతి, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా నాగపూర్ జాతీయ పత్తి పరిశోధన కేంద్రం సంచాలకులు డాక్టర్ వైజీ.ప్రసాద్, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి, పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ హాజరవుతారని పేర్కొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న సుబ్బరాయుడు

నస్పూర్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అన్ని రకాల మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం ఆయన నస్పూర్ పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతీగర్భిణి వివరాలు నమోదు చేయాలని, డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మెడికల్ హబ్ ద్వారా అందుతున్న సేవలను ప్రజలకు వివరించాలని, వంద శాతం టీకాలు సరైన సమయంలో అందించాలని అన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయనిర్మల, డీఎస్‌ఓ ఫయాజ్, మెడికల్ ఆఫీసర్ సమత, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

జన్నారం మండల వాసికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీపాల్

జన్నారం: మండలంలోని కామన్‌పల్లి గ్రామానికి చెందిన పేరం శ్రీపాల్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల మానసిక ఆరోగ్యం.. ప్రభావవంతమైన బోధన' అనే అంశంపై ప్రొఫెసర్ మధుమతి పర్యవేక్షణలో బోధన పరిశోధన పూర్తి చేసినట్లు శ్రీపాల్ తెలిపారు. ఈమేరకు ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీందర్ చేతుల మీదుగా తాను డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు శ్రీపాల్‌కు అభినందనలు తెలిపారు.

'గోపగాని'కి రాష్ట్రస్థాయి పురస్కారం



రవీందర్

దండేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు పండితుడు కవి, రచయిత గోపగాని రవీందర్ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. రవీందర్ రచించిన వచన కవిత్వ విమర్శ వ్యాసాల పుస్తకం 'శతారం' రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైంది. ఈనెల 14న హైదరాబాద్‌లో రవీందర్ పురస్కారాన్ని అందుకోనున్నారు.

ఇంటింటా సర్వే నిర్వహించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న సుబ్బరాయుడు

జన్నారం: బీపీ, డయాబెటిస్ రోగుల వివరాలకు ఇంటింటికి సర్వే నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించారు. మహిళలకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీపీ, షుగర్ వ్యాధులను గుర్తించి సరైన సమయంలో మందులు అందించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల, పీఎస్‌వో ఫైజా, మెడికల్ అధికారులు సుప్రియ, ఉమాశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గుస్సాడీ దర్బార్

దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున గల ఆదివాసీల ఆరాధ్య దైవం శ్రీపద్మల్‌పురి కాకో ఆలయంలో బుధవారం గుస్సాడీ దర్బార్ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కుడిమేత సోము మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాతో పాటు, ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు దర్బార్‌కు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వేబ్రిడ్జిల తనిఖీ

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి, లింగాపూర్ గ్రామాల్లోని వేబ్రిడ్జిలను జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి విశ్వేశ్వర్‌రావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కన్నెపల్లి వేబ్రిడ్జిల వద్ద టెస్ట్ వెయిట్స్ అందుబాటులో లేవు. దీంతో వాటికి రూ.5వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

హస్తగతమెప్పుడో!

- పాత ఆసిఫాబాద్, బెల్లంపల్లిలో 30 ఏళ్లుగా ప్రాతినిధ్యం కరువు
- ప్రస్తుతం బెల్లంపల్లి బరిలో కాంగ్రెస్
- గడ్డం వినోద్‌ను దింపిన అధిష్టానం
- ఈ సారైనా విజయం సాధించేనా?



బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లాలోని పాత ఆసిఫాబాద్, కొత్తగా ఏర్పడిన బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్‌కు మూడు దశాబ్దాల నుంచి ఒక్కసారి కూడా ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కలేదు. 1994 నుంచి వరుసగా ఆరు దఫాలు అసెంబ్లీ ఎన్నికలు జరిగినా హస్తం పార్టీకి ఆ అదృష్టం వరించలేదు. ఏదో తీరుగా పరాభవమే ఎదురైంది. అసెంబ్లీలోకి అడుగు పెట్టేందుకు ఏళ్ల తరబడి ఆ పార్టీ ఎదురుచూస్తూనే ఉంది. ఇన్నేళ్లలో కాంగ్రెస్ ఎంతగా యత్నించినా ప్రయోజనం దక్కలేదు. ప్రతీసారి ఎన్నికల్లో పొత్తు పెట్టుకోవడంతో మిత్రపక్షమైన సీపీఐకి ఈ నియోజకవర్గాన్ని వదిలేయడమో.. లేదా.. కాంగ్రెస్ అభ్యర్థి పోటీ చేసినా విజయం సాధించలేకపోవడమో జరుగుతోంది. ఈసారి కూడా సీపీఐతో పొత్తు పెట్టుకున్నప్పటికీ బెల్లంపల్లి సెగ్మెంట్‌ను వదిలేయడానికి కాంగ్రెస్ అధిష్టానం ససేమిరా అంది. పార్టీ తరఫున అభ్యర్థిని బరిలోకి దింపింది. ప్రస్తుతం ఈ అంశం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో అన్ని విధాలా సరితూగే ధీటైన అభ్యర్థి మాజీ మంత్రి గడ్డం వినోద్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపింది. దీంతో బెల్లంపలిలో రసవత్తర పోటీ ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

పాత ఆసిఫాబాద్ నియోజకవర్గంలో..

1952లో ఏర్పడిన పాత ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో బెల్లంపల్లి ప్రధాన పట్టణంగా ఉండేది. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం ఆసిఫాబాద్ అయినప్పటికీ కార్మిక క్షేత్రమైన బెల్లంపల్లి నుంచే నాయకులు ఎన్నికల్లో పోటీ చేసేవారు. కాంగ్రెస్‌కు చెందిన దాసరి నర్సయ్య పాత ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు పోటీ చేసి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తొలిసారి 1978లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి నర్సయ్య విజయం సాధించారు. తదుపరి 1983లో జరిగిన ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. 1985 ఎన్నికల్లోనూ ఓటమి చవిచూశారు. కాగా, 1989లో జరిగిన ఎన్నికల్లో నర్సయ్య విజయభావుటా ఎగురవేశారు. ఆ ఎన్నికల్లో గెలిచి రాష్ట్ర ఫెడ్కాన్ చైర్మన్‌గా పని చేశారు. 1994లో నిర్వహించిన ఎన్నికల్లోనూ పోటీ చేసి నర్సయ్య ఓటమిపాలు కాగా, ఆ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌కు మరింత కష్టకాలం ఎదురవుతూ వచ్చింది. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో ఈ స్థానాన్ని కాంగ్రెస్ పొత్తులో భాగంగా సీపీఐకి ఈ నియోజకవర్గాన్ని కేటాయించగా పరాజయం పాలై పట్టు కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీ వరుసగా ప్రతికూల పరిస్థితులను చవిచూడాల్సి వచ్చింది.

ఈసారి పట్టుదలతో పోటీ..

బెల్లంపల్లి ఎన్నికల పోరులో కాంగ్రెస్ పట్టుదలతో తలపడుతోంది. తాడో.. పేడో తేల్చుకోవడానికి సిద్ధపడింది. అధికార పార్టీకి సరిసమాన స్థాయిలో అభ్యర్థిని కాంగ్రెస్ నిలబెట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీపీఐతో పొత్తు కుదుర్చుకుని కాంగ్రెస్ రంగంలోకి దిగింది. కాంగ్రెస్ ఓట్లతోపాటు సీపీఐ సంప్రదాయ ఓట్లూ కలిసి వచ్చే అంశంగా పార్టీ భావిస్తోంది. నియోజకవర్గంలో ఇప్పుడిప్పుడే ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. ఇప్పటి వరకు సొంత పార్టీవాళ్లనే సరి చేసుకోవడానికి కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తుండటంతో సీపీఐ, కాంగ్రెస్ ఉమ్మడిగా ప్రచారం చేపట్టలేదు. మరి ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు ఎంతవరకు కలిసి వస్తాయనే విషయం ఆసక్తి మారింది.

బెల్లంపల్లి నియోజకవర్గంలోనూ..

పాత ఆసిఫాబాద్ నుంచి విడిపోయి 2009లో బెల్లంపల్లి ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది. కొత్తగా ఏర్పడిన ఈ నియోజకవర్గంలో అదే ఏటా ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున చిలుముల శంకర్ పోటీ చేసి ఓడిపోయారు. తిరిగి 2014లో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో పొత్తులో భాగంగా కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గాన్ని సీపీఐకి వదిలేసింది. అయితే కాంగ్రెస్‌కు చెందిన చిలుముల శంకర్ రెబల్‌గా రంగంలోకి దిగేందుకు సిద్ధపడి ఆఖరు దశలో పోటీ నుంచి విరమించుకున్నారు. కాంగ్రెస్, సీపీఐ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన గుండా మల్లేశ్‌ను అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య ఓడించారు. ఆ తదుపరి 2018 ఎన్నికల్లోనూ సీపీఐ, కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నాయి. అప్పుడూ సీపీఐకే బెల్లంపల్లి సీటు కాంగ్రెస్ త్యాగం చేయాల్సి వచ్చింది. కానీ.. ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుత బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేతిలో కాంగ్రెస్, సీపీఐ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన గుండా మల్లేశ్ రెండోసారి కూడా పరాజయం పాలయ్యారు. ఇలా సొంతంగా పోటీ చేసి, పొత్తులో భాగంగా సీపీఐకి వదిలేసి.. 1994 ఎన్నికల నుంచి పాత ఆసిఫాబాద్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు కోలుకోని పరిస్థితులు ఏర్పడ్డాయి.

కౌన్సిలర్ టు ఎమ్మెల్యే



గోనె హన్మంతరావు



నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాజకీయాలు అందరికీ రావు. వ్యూహ, ప్రతివ్యూహాలు ఉంటేనే గాని రాణించలేరు. అనేక ఎత్తు పల్లాలు వస్తాయి. కొంతమంది సేవాభావంతో పట్టుదలతో రాజకీయ కాంక్షను పెంచుకుని ప్రజల అండదండలతో ఉన్నత పదవులు అలంకరిస్తారు. మరి కొంతమంది ఇలా వచ్చి అలా కనుమరుగవుతారు. ఇంకొంతమంది పట్టణ, గ్రామీణ స్థాయి రాజకీయాలకు మాత్రమే పరిమితమవుతారు. అంతేకాదు గ్రామ, పట్టణ స్థాయి నుంచి ఉన్నత శిఖరాలు అధిరోహించిన నేతలూ ఉన్నారు. చిన్న పదవులు అలంకరించిన వారు ఏకంగా ప్రజాప్రతినిధిగా ప్రజల అభిమానాన్ని పొందిన వారూ ఉన్నారు. సర్పంచ్, కౌన్సిలర్‌గా పనిచేసిన వారు కూడా నేడు రాజకీయాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. మంచిర్యాలలో కౌన్సిలర్ ఎన్నికై నవారు ఎమ్మెల్యే స్థాయికి ఎదిగినవారు ఇద్దరున్నారు. ఇందులో దివంగత మాజీ ఎమ్మెల్యే గోనె హన్మంతరావు, ప్రస్తుత ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు. వీరిద్దరు కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అసెంబ్లీలోనూ అడుగుపెట్టారు. వీరిద్దరి నివాసస్థలం 'పాతమంచిర్యాల' కావడం విశేషం. వీరు బంధువులు కూడా.. వరుసకు బావ, బావమరదులు. ఇక రాజకీయ రంగంలోనూ కీలక నేతలుగా ఎదిగారు.

టీడీపీ నుంచి గెలిచిన 'గోనె'

గోనె హన్మంతరావు కాంగ్రెస్ నుంచి రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా పని చేశారు. 1961లో జరిగిన ఎన్నికల్లో పాతమంచిర్యాల నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1967లో మరోసారి జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. అప్పటినుంచి రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించారు. 1987లో సింగిల్ విండో చైర్మన్‌గా పోటీ చేశారు. మంచిర్యాలలో అవకాశం లేకపోవడంతో కాసిపేట మండలం ముత్యంపల్లి నుంచి సింగిల్ విండో చైర్మన్‌గా గెలిచారు. ఆ తర్వాత జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా సేవలందించారు. 1989లో లక్సెట్టిపేట (ప్రస్తుతం మంచిర్యాల) నియోజకవర్గం నుంచి టీడీపీ నుంచి టికెట్ కోసం యత్నించి విఫలమయ్యారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టికెట్ లభించగా దివంగత ఎన్టీఆర్ ప్రభంజనంలో విజయం సాధించి శాసనసభలో అడుగుపెట్టారు. 1999, 2010 ఎన్నికల్లో టికెట్ వచ్చినా కాలం కలిసిరాక ఓడిపోయారు. రాజకీయాల నుంచి వైదొలిగిన ఆయన అనారోగ్యంతో మృతి చెందారు.

నడిపెల్లి.. నాలుగు పర్యాయాలు

నడిపెల్లి దివాకర్‌రావు సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు. కిరాణా వ్యాపారిగా, ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేశారు. 1981లో జరిగిన పురపాలక సంఘం ఎన్నికల్లో ఆయన ఏడోవార్డు నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలిచారు. 1987లో మంచిర్యాల సింగిల్ విండో చైర్మన్‌గా పోటీ చేసి విజయం సాధించారు. బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పని చేసిన సమయంలోనే 1999లో దివంగత రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో టికెట్ దక్కించుకుని గెలుపొంది మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2004లో జరిగిన ఎన్నికల్లో దివాకర్‌రావు రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక 2009లో టికెట్ వచ్చినా టీఆర్ఎస్ ప్రభంజనంలో ఓటమి చెందారు. తిరిగి 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి టికెట్ తీసుకుని ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం ఐదోసారి బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్నారు.

నూతన నియామకం



అక్కెపల్లి బాపు

బెల్లంపల్లి: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు బెల్లంపల్లికి చెందిన అక్కెపల్లి బాపు భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపికయ్యారు. బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈనెల 2నుంచి 5వ తేదీ వరకు బీకేఎంయూ జాతీయ 15వ మహాసభలు జరిగాయి. ఈ సభల్లో బాపు వరుసగా రెండోసారి జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపికయ్యారు. బాపును దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డీఆర్ శ్రీధర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, బెల్లంపల్లి పట్టణ, మండల కార్యదర్శులు ఆడేపు రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ అభినందించారు. బాపు మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులు, దినసరి, ఉపాధి కూలీల సమస్యలపై పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. తనకు రెండుసార్లు పదవి అప్పగించిన జాతీయ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ రైతుకు సన్మానం



రైతు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

నెన్నెల: మండలంలోని గన్‌పూర్ గ్రామానికి చెందిన రైతు మెండే నర్సయ్య వివిధ రకాల మామిడి పండ్లు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేసి ఉత్తమ రైతుగా ఎంపికయ్యాడు. కర్ణాటక రైతు సమాఖ్య ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్ అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డు అందుకోనున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గట్టు మల్లేశ్, నాయకులు దుర్గం రవి, ఉయ్యాల మల్లిక, అర్కాల ఓదెలు, జగేందర్‌సింగ్ నర్సయ్యను సన్మానించారు. మూడు రాష్ట్రాల్లో లభించని ప్రత్యేక మామిడి రకాలను అక్కడి ప్రజలకు అందించి అవార్డు పొందిన అతడిని అభినందించారు.

బీఆర్ఎస్‌కు కౌన్సిలర్ రాజీనామా

- మున్సిపల్ కౌన్సిలర్ పదవికి కూడా..



రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న సతీశ్

చెన్నూర్: బీఆర్ఎస్ పార్టీకి, మున్సిపల్ కౌన్సిలర్ పదవికి చెన్నూర్ పట్టణానికి చెందిన పోగుల సతీశ్ రాజీనామా చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ సాధనే లక్ష్యంగా 2001నుంచి గులాబీ జెండా మోసిన తనకు పార్టీలో గుర్తింపు లేదని వాపోయారు. పార్టీ ద్రోహులకు పదవులు దక్కుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ తీరును నిరసిస్తూ చెన్నూర్ ఒకటో వార్డు కౌన్సిలర్ పదవికి, బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు సతీశ్ తెలిపారు. అధికార పార్టీ కౌన్సిలర్‌గా వార్డు ప్రజలకు న్యాయం చేయలేపోతున్నానని ఆవేదన వ్యక్తంజేశారు. బాల్క సుమన్ నియంతలా వ్యవహరిస్తూ కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, పట్టణ అభివృద్ధి పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. బాల్క సుమన్ పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. త్వరలోనే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

చిన్నధర్మారంలో నీళ్ల లొల్లి

- సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుల నిలదీత



సర్పంచ్‌తో వాదనకు దిగిన గ్రామస్తులు

కాసిపేట: మండలంలోని చిన్న ధర్మారం గ్రామంలో ఎన్నికల వేళ నీళ్ల లొల్లి, నాయకుల నిలదీత చర్చనీయాంశమైంది. గ్రామపంచాయతీ పరిధిలో తరచూ నీటిసమస్య ఉంది. కాగా, ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని మహిళలు ఆరోపించారు. వారంరోజులుగా నీళ్లు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సమీప వాగు నుంచి నీటిని తీసుకువచ్చి బిందెలతో నిరసన తెలిపేందుకు సిద్ధపడ్డారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, వైస్ ఎంపీపీ విక్రంరావు, సర్పంచ్ సునీత దంపతులు అక్కడికి చేరుకున్నారు. సమస్య వివరిస్తున్న క్రమంలో గ్రామస్తులతో సర్పంచ్ దురుసుగా ప్రవర్తించారు. దీంతో మహిళలు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా సమస్య పరిష్కరిస్తామని పట్టించుకోవడం లేదని నిలదీశారు. సర్పంచ్ తీరును నిరసించారు. కాగా, సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పి బీఆర్ఎస్ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నేడు చెన్నూర్‌కు బస్సుయాత్ర

చెన్నూర్: రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఓటర్లకు ఓటు విలువ తెలియజేయాలనే ఉద్దేశంతో ఉమ్మడి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు చైతన్య బస్సుయాత్ర బుధవారం రాత్రి చెన్నూర్‌కు చేరుకుంది. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాత్రి 7.15నుంచి 8.15వరకు సమావేశం ఉంటుంది. బస్సుయాత్ర నిర్వాహకులు బుధవారం రాత్రి చెన్నూర్ పట్టణంలో బస చేస్తారు. ఈ నెల 9న గురువారం ఉదయం 6నుంచి 7గంటల వరకు ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా వాకర్స్‌తో సమావేశమవుతారు. అనంతరం యాత్ర చెన్నూర్ నుంచి భీమారం మీదుగా బెల్లంపల్లి నియోజకవర్గానికి వెళ్తుంది.

'పది'ంతల ప్రణాళిక

- డిసెంబర్ 30దాకా స్పెషల్ క్లాసులు
- 41రోజులపాటు కాలపట్టిక విడుదల
- విద్యార్థుల అల్పాహారంపై స్పష్టతేది?



పారపల్లి జెడ్పీ హెచ్ఎస్‌లో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: 'పది'లమైన ఫలితాల కోసం విద్యాశాఖ చర్యలు చేపట్టింది. సర్కారు పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించటానికి పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించింది. ఇందులో భాగంగా అన్ని పాఠశాలల్లో గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఆదర్శ, కేజీబీవీ, గురుకులాల్లో 2023-24 విద్యాసంవత్సరానికి గాను ఉదయం 8.30నుంచి 9.30గంటల వరకు రోజుకు ఒక సబ్జెక్ట్ చదివిస్తారు. 129 జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, టీఎస్ఎంఎస్, కేజీబీవీల్లో 12,065 మంది విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరుకానున్నారు. సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు విద్యార్థుల సందేహాలు నివృత్తి చేయనున్నారు. నవంబర్ 6నుంచి డిసెంబర్ 30వరకు 41రోజుల పాటు ప్రత్యేక కాలపట్టికను విద్యాశాఖ విడుదల చేసింది. జనవరి నుంచి వార్షిక పరీక్షల వరకు సాయంత్రం బడివేళలు ముగిసిన తర్వాత మరో గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. దీంతోపాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ సబ్జెక్ట్‌పై విద్యార్థులకు తరతగతులు నిర్వహించనున్నారు.

అల్పాహారం ఎలా?

పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రత్యేక తరగతుల కోసం పాఠశాల సమయానికి కంటే ముందుగా రావాల్సి ఉంటుంది. దీంతో అర్ధాకలితో వచ్చి పాఠాలు వినాల్సి ఉంటుంది. దసరాకు ముందు సర్కారు బడుల్లో అల్పాహార పథకం (సీఎం బ్రేక్ ఫాస్ట్) మొదలైనా ఉన్నత పాఠశాలల్లో అమలు కావటం లేదు. మొదట్లో నియోజకవర్గానికి ఒక్కో పాఠశాలలో ప్రారంభించగా, తర్వాత కాలంలో మండలానికి రెండు చొప్పున ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందిస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉంది. గతేడాది కలెక్టర్ భారతి హోళ్లికేరి పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం అవసరమైన రూ.10.47లక్షల నిధులు మంజూరు చేసింది. ఈనెల 7నుంచి 40రోజుల పాటు రోజుకు రూ.26,175 చొప్పున అందించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న అల్పాహార పథకం పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సబ్జెక్టులు, తేదీల వారీగా..

సబ్జెక్ట్	నవంబర్‌లో..	డిసెంబర్‌లో..
గణితం	6, 9, 18, 28	8, 16, 21, 27
హిందీ	7, 17, 25	7, 22
సోషల్	8, 15, 21, 23	5, 13, 23
భౌతికశాస్త్రం	10	1, 12, 19, 28
ఇంగ్లిష్	13	2, 11, 14, 18, 29
జీవశాస్త్రం	14, 22	4, 20
తెలుగు	16, 20, 24	6, 15, 30

శతశాతం ఫలితాలు సాధించాలి

పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో ముందుకుసాగాలి. సిలబస్‌ను జనవరి 10వరకు పూర్తి చేయాలి. ప్రతీరోజు ఉదయం ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. నిర్ణీత సమయంలో ప్రత్యేక తరగతులు తీసుకోవాలి. విద్యార్థులను పాఠశాల వెలుపల, వరండాలో కూర్చోబెట్టరాదు. ప్రత్యేక తరగతులు బోధించే ఉపాధ్యాయులు తప్పనిసరిగా చాక్ బోర్డును ఉపయోగించాలి. ప్రత్యేక తరగతుల్లో భాగంగా ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ తీసుకోవాలి. పాఠం బోధించే సమయంలో విద్యార్థులు తప్పనిసరిగా రన్నింగ్ నోట్స్ మెయింటెయిన్ చేయాలి. ప్రతీరోజు విద్యార్థులకు హోంవర్క్ ఇవ్వటంతో పాటు నోట్స్ సరిదిద్దాలి. ప్రతీ పాఠశాలలో స్టడీ అవర్స్ రిజిస్టర్లు నిర్వహించాలి.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

బీజేపీ అభ్యర్థిపై ఆరు కేసులు!

- కుటుంబ ఆస్తులు రూ.48కోట్లు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీజేపీ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్‌రావు, ఆయన సతీమణి పేరిట ఉన్న స్థిర, చరాస్తులు, కేసుల వివరాలు అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. పోటీ చేసే ప్రతీ అభ్యర్థి తన ఆస్తులు, నేరచరిత, ఆదాయం తదితర వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రమాణపత్రం దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈక్రమంలో రఘునాథ్, ఆయన సతీమణి ప్రవంతి పేరుతో ఉన్న ఆస్తులు, అప్పుల వివరాలు వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో చివరగా దంపతులిద్దరు ఐటీ రిటర్న్స్ దాఖలు చేశారు. దంపతులిద్దరి పేరుతో చర, స్థిరాస్తులు హైదరాబాద్‌లో నివాసగృహం, భవన నిర్మాణం, విల్లాలు, వ్యవసాయేతర భూమి, పెద్దపల్లి జిల్లా నీరుకుల్లలో భూమి, హకీంపేట, సిద్దంపేట, మేడ్చల్, జీడిమెట్ల, కోకాపేట, మంచిర్యాలలో చున్నం బట్టివాడ ప్లాట్, హైటెక్ సిటీ కాలనీల్లో నివాసం, ఇతర స్థిరాస్తి ఉన్నట్లు తెలిపారు. రఘునాథ్ పేరిట ఉన్న వేదాంత ఎడ్యూసర్వే ప్రైవేట్ లిమిటెడ్, సురభి ఎలిట్ హస్పికాన్ ప్రైవేట్ లిమిటెడ్, మంచిర్యాల స్పోర్ట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, కాగ్నిన్ టెక్నాలజీస్, అరునిత ఇన్‌ఫ్రా, వెర మోటర్స్, వెర ఐటీ సొల్యూషన్స్ కంపెనీల్లో ఉన్న వాటాలు, ఎల్ఐసీ పాలసీల వివరాలు వెల్లడించారు. గత ఎన్నికల్లో కంటే ఈసారి ఆయన ఆస్తుల విలువ స్వల్పంగా పెరిగింది. సీసీసీ నస్పూర్, హాజీపూర్, దండేపల్లి, మంచిర్యాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆరు కేసులున్నట్లు తెలిపారు. భార్యాభర్తల చేతిలో నగదు వరుసగా రూ.1.20లక్షలు, రూ.52వేలు ఉన్నట్లు చూపారు. మొత్తంగా ఇద్దరి పేరిట చరాస్తి విలువ రూ.10.08కోట్లు, స్థిరాస్తి విలువ ఇద్దరి పేరుతో రూ.38.1 కోట్ల వ్యవసాయ భూములు, భవనాలు, నిర్మాణాలు, నివాస స్థలాలున్నట్లు పేర్కొన్నారు. రఘునాథ్‌కు బ్యాంక్‌లో రూ.1.58కోట్ల రుణం ఉన్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో రెండు ఫేస్‌బుక్, ఒక ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలున్నట్లు పేర్కొన్నారు.

ఇంద్రాదేవి ఆలయంలో గుస్సాడీల పూజలు



పూజలు చేస్తున్న అలికోరి గుస్సాడీలు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో మంగళవారం అలికోరి గ్రామానికి చెందిన గుస్సాడీలు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీల ఆనవాయితీ ప్రకారం ప్రతీ ఏడాది భోగి పూజలతో ప్రారంభించిన దండారీ ఉత్సవాలు మరుసటి రోజు ఇంద్రాదేవి ఆలయానికి వచ్చి పూజలు చేస్తామని, అక్కడ నుంచే వేరే గ్రామానికి అతిథులుగా వెళ్తామని, ఇతర గ్రామాల దండారీ బృందాన్ని అతిథులుగా ఆహ్వానిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో అలికోరి గ్రామ పెద్దలు దేవ్‌రావ్, చిత్రు, ఆలయ పూజారి చహకటి సూర్యరావ్ ఉన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
8-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	16	64,942
నిఫ్టీ ▽	5	19,407

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	13,615	△ 93
డోజోన్స్	34,141	△ 45
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,410	▽ 8
డాక్స్	15,153	△ 17
షాంఘై	3,057	▽ 1
నికాయ్	32,708	▽ 448

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,579	▽ 474
బంగారం (99.5 స్వచ్ఛత)	60,336	▽ 472
వెండి (కిలో)	72,705	▽ 1,332

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.99	103.36
€	యూరో	ఎస్‌బీఐ	87.01	90.10
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.58	56.26
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.53	54.84
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.20	62.14
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.65	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.29	12.38

స్వల్పంగా పెరిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణ రేటు



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొన్ని కాలపరిమితుల రుణాలపై వడ్డీ రేటును స్వల్పంగా 0.05 శాతం (ఐదు బేసిస్ పాయింట్లు) పెంచింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గడచిన ఐదు ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లోనూ రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5%) పెంపుపై ఎటువంటి నిర్ణయం తీసుకోనప్పటికీ, హెచ్‌డీఎఫ్‌సీ తాజా రేటు పెంపు నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 8.65 శాతానికి పెరిగింది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ 9.30 శాతానికి ఎగసింది. కాగా, సాధారణంగా అధిక రుణాలకు ప్రాతిపదిక అయిన ఏడాది రుణ రేటు మాత్రం 9.20 శాతం వద్ద స్థిరంగా ఉంది.

హైదరాబాద్‌లో రిలయన్స్ స్వదేశ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ 'స్వదేశ్' తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసింది. రిలయన్స్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్‌పర్సన్ నీతా అంబానీ చేతుల మీదుగా నేడు (బుధవారం) ఈ స్టోర్ ప్రారంభం కానుంది. సుమారు 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది కొలువుదీరింది. చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఫర్నిచర్, బొమ్మలు, ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు, పెయింటింగ్స్, యాక్సెసరీస్‌తోపాటు వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తారు. దేశవ్యాప్తంగా చేతి వృత్తుల కళాకారులకు చెందిన గుర్తింపు ఉన్న సంఘాల నుంచి నేరుగా వీటిని సేకరిస్తారు. రూ.6 లక్షలకుపైగా ధర పలికే వస్తువులనూ విక్రయిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

08-11-2023	
విశాఖ	530-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
07-11-2023 ఫామ్ ధర..	
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

వుయ్‌వర్క్ దివాలా!

- వ్యాపార పునర్‌వ్యవస్థీకరణపై దృష్టి
- లీజుల క్రమబద్ధీకరణకు కసరత్తు



న్యూయార్క్: ఆఫీస్ స్పేస్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన అంతర్జాతీయ దిగ్గజం వుయ్‌వర్క్ దివాలా ప్రకటించింది. వ్యాపారాన్ని యథాప్రకారం కొనసాగిస్తూ, కార్యకలాపాలను పునర్‌వ్యవస్థీకరించుకునే దిశగా అమెరికాలో చాప్టర్ 11 దివాలా పిటిషన్ దాఖలు చేసింది. వ్యాపార పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది. కమర్షియల్ ఆఫీస్ లీజుల పోర్ట్‌ఫోలియోను మరింత క్రమబద్ధీకరించుకోనున్నట్లు పేర్కొంది. రుణభారాన్ని గణనీయంగా తగ్గించుకునే దిశగా పునర్‌వ్యవస్థీకరణ విషయంలో తోడ్పాటు అందించేలా సంబంధిత వాటాదారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. అమెరికా, కెనడా వెలుపలి దేశాల్లోని తమ కార్యకలాపాలపై ఈ పరిణామ ప్రభావం ఉండబోదని వుయ్‌వర్క్ వివరించింది. సమస్యలను పరిష్కరించుకుని, వ్యాపారాన్ని మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగడంపై దృష్టి పెడుతున్నట్లు సంస్థ సీఈవో డేవిడ్ టోలీ ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ ఈ ఏడాది ప్రథమార్ధంలో 696 మిలియన్ డాలర్ల నష్టం నమోదు చేసింది. జూన్ 30 నాటికి వుయ్‌వర్క్‌కు 39 దేశాల్లో 777 చోట్ల కార్యకలాపాలు ఉన్నాయి.

అప్పట్లో 50 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్ ..

గతంలో దాదాపు 50 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో వెలుగొందిన వుయ్‌వర్క్ దివాలా తీయడానికి అనేక కారణాలు ఉన్నాయి. అతి దూకుడుగా విస్తరించడం, వ్యవస్థాపకుడు ఆడమ్ న్యూమాన్ పోకడలు మొదలైనవి ఇందుకు దారితీశాయి. వాస్తవానికి కొన్నాళ్ల క్రితం నుంచే దివాలా సంకేతాలు కనిపించడం మొదలైంది. 2019లో తొలి పబ్లిక్ ఇష్యూ ప్రయత్నం ఘోరంగా విఫలం కాగా ఆ తర్వాత 2021లో ఐపీవోకి వచ్చినా వేల్యుయేషన్ అనేక రెట్లు తగ్గి 9 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతకన్నా ముందే కంపెనీ, వ్యవస్థాపకుడి పనితీరుపై ఇన్వెస్టర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో.. న్యూమాన్ ఉద్వాసనకు గురయ్యారు. సంస్థలో మెజారిటీ వాటాలు తీసుకున్న జపాన్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్.. కంపెనీని నిలబెట్టేందుకు ప్రయత్నించింది. నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవడం, ఆదాయాన్ని పెంచుకోవడం వంటి ప్రయత్నాలు జరిగినా పెద్దగా ఫలితం లేకపోయింది. వ్యాపారాన్ని కొనసాగించే సామర్థ్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయంటూ వుయ్‌వర్క్ ఆగస్టులోనే వెల్లడించింది. ఆ తర్వాత లీజులన్నింటినీ పునఃసమీక్షించుకునే యోచనలో ఉన్నట్లు సెప్టెంబర్‌లో ప్రకటించింది. నష్టాల్లో ఉన్న లొకేషన్ల నుంచి వైదొలగనున్నట్లు తెలిపింది.

భారత్‌లో ప్రభావం ఉండదు..

వుయ్‌వర్క్ గ్లోబల్ దివాలా ప్రభావం భారత విభాగంపై ఉండదని వుయ్‌వర్క్ ఇండియా సీఈవో కరణ్ విర్వాణి స్పష్టం చేశారు. దివాలా ప్రక్రియలో భారత వ్యాపారం భాగంగా లేదని తెలిపారు. వుయ్‌వర్క్ ఇండియాలో రియల్ ఎస్టేట్ సంస్థ ఎంబసీ గ్రూప్‌నకు 73 శాతం, వుయ్‌వర్క్ గ్లోబల్‌కు 27 శాతం వాటాలు ఉన్నాయి. భారత్‌లో ఏడు నగరాల్లో వుయ్‌వర్క్ ఇండియాకు 50 కేంద్రాలు ఉన్నాయి. 2021 జూన్‌లో వుయ్‌వర్క్ ఇండియాలో వుయ్‌వర్క్ గ్లోబల్ 100 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది.

బ్యాంకింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఫిన్‌టెక్


'ఆర్‌బీఐ' నివేదిక



ముంబై: సమీప భవిష్యత్తులో సాంప్రదాయ బ్యాంకింగ్‌కు ఫిన్‌టెక్ రంగం ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ ఫైనాన్షియల్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ (కెఫ్రాల్) ఒక నివేదికలో పేర్కొంది. డిజిటలీకరణ వృద్ధికి, ఆర్థిక స్థిరత్వ సాధనకు ఎప్పటికప్పుడు తగు విధంగా మల్చుకోగలిగే నియంత్రణ విధానాలు అవసరమని తెలిపింది. ఇండియా ఫైనాన్స్ రిపోర్ట్ 2023 పేరిట కెఫ్రాల్ రూపొందించిన తొలి ప్రచురణను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం విడుదల చేశారు. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు 2011లో కెఫ్రాల్‌ను లాభాపేక్ష రహిత సంస్థగా ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. దేశీయంగా బ్యాంకిగేతర ఆర్థిక రంగ స్థితిగతులను అర్థం చేసుకోవడంలో నియంత్రణ సంస్థలు, విధాన నిర్ణేతలు సహా సంబంధిత వర్గాలకు సహాయకరంగా ఉండే అంశాలను తాజా నివేదికలో పొందుపర్చారు. దేశీ సాంకేతిక తోడ్పాటుతో భారత్‌లో డిజిటలీకరణ వేగవంతమవుతోందని, డిజిటల్ రుణాలు.. ముఖ్యంగా ఫిన్‌టెక్ రుణాలు గణనీయంగా పెరిగాయని నివేదిక పేర్కొంది.

పవర్ గ్రిడ్ లాభం అప్

క్యూ2లో రూ. 3,781 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్ గ్రిడ్ కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 3,781 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,650 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,349 కోట్ల నుంచి రూ. 11,530 కోట్లకు ఎగసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. డిసెంబర్ 6కల్లా చెల్లించనుంది.

ఫలితాల నేపథ్యంలో పవర్ గ్రిడ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో దాదాపు యథాతథంగా రూ. 208 వద్ద ముగిసింది.

జోయాలుక్కాస్ దీపావళి క్యాష్‌బ్యాక్ ఆఫర్లు



హైదరాబాద్: దీపావళి సందర్భంగా జోయాలుక్కాస్ క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ప్రకటించింది. రూ.50,000 విలువైన డైమండ్, అన్ కట్ డైమండ్స్–ప్రెషస్ జ్యూవెలరీ కొనుగోలుపై రూ.2 వేల విలువైన క్యాష్‌బ్యాక్ గిఫ్ట్ వోచర్ పొందవచ్చు. అలాగే రూ.50 వేల విలువైన బంగారం ఆభరణాల కొనుగోలుపై రూ.1000 విలువైన క్యాష్‌బ్యాక్ గిఫ్ట్ వోచర్, రూ.10వేల విలువైన వెండి ఆభరణాలపై రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్లు అందిస్తుంది. అడ్వాన్స్ బుకింగ్ స్కీమ్‌తో షాపింగ్ చేసే కస్టమర్లు ప్రోత్సాహక బహుమతి పొందొచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఆఫర్లు నవంబర్ 12 వరకు అమలులో ఉంటాయి. క్యాష్‌బ్యాక్ రూపంలో కస్టమర్లకు మేమిచ్చే బహుమతులు వారి దీపావళిని మరింత శోభాయమానం చేస్తాయని సంస్థ ఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

3 రోజుల లాభాలకు బ్రేక్

- స్వల్ప నష్టాల ముగింపు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం



ముంబై: దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగడంతో స్టాక్ సూచీల 3 రోజుల వరుస లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. ఆసియా, యూరప్ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఛత్తీస్‌గఢ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించారు. ట్రేడింగ్‌లో 383 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 16 పాయింట్ల స్వల్ప నష్టంతో 64,942 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి ఐదు పాయింట్ల నష్టంతో 19,407 వద్ద నిలిచింది. చైనా అక్టోబర్ ఎగుమతులు భారీగా క్షీణించినట్లు డేటా వెల్లడికావడంతో ఆసియాలో ఒక్క తైవాన్ తప్ప మిగిలిన అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% నష్టపోయాయి. కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాల ప్రకటన, ఇంధన షేర్ల పతనంతో యూరప్ మార్కెట్లు ఒకశాతం మేర పతనమయ్యాయి.

- హోనాసా కన్జూమర్ లిస్టింగ్ పర్వాలేదనిపించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.324) వద్దే లిస్టయ్యింది. చివరికి 4% లాభంతో రూ.337 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.10,848 కోట్లుగా నమోదైంది.
- ఈఎస్‌ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓ చివరిరోజు నాటికి 73.15 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది. 5.77 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 422 కోట్ల ఈక్విటీలకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 173.52 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 84.37 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 16.97 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.

మ్యాక్సివిజన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోని



చెన్నై: కంటి సంరక్షణ సేవల సంస్థ మ్యాక్సివిజన్‌సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ తాజాగా క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనిని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. అన్ని వర్గాలకు చిరపరిచితమైన ధోని వంటి దిగ్గజంతో జత కట్టడమనేది.. క్రమం తప్పకుండా కంటి చెకప్‌లు చేయించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచడానికి దోహదపడగలదని సంస్థ సీఎండీ జీఎస్‌కే వేలు తెలిపారు. చౌకగా కంటి సంరక్షణ సేవలను అందరికీ అందుబాటులోకి తేవాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. తమ నెట్‌వర్క్‌లోని 40కిపైగా ఆస్పత్రుల్లో నిత్యం వేల కొద్దీ పేషెంట్లకు సర్వీసులు అందిస్తున్నామని సంస్థ సీఈవో సుధీర్ వీఎస్ తెలిపారు.

భవిత

జాబ్ పాయింట్

ఎన్‌ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 04
» అర్హత: పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఎంబీఏ(హెచ్‌ఆర్) చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.32,000.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.11.2023
» వెబ్‌సైట్: www.nirdpr.in

పీజీసీఐఎల్, న్యూఢిల్లీలో 10 ఆఫీసర్ ట్రైనీ(లా) పోస్టులు

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్).. క్లాట్ 2024 స్కోరు ద్వారా ఆఫీసర్ ట్రైనీ(లా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 10
» అర్హత: 60 శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ లేదా ఇంటిగ్రేటెడ్ లా/ఎల్‌ఎల్‌బీ కోర్సు ఉత్తీర్ణతతో పాటు క్లాట్–2024 స్కోరు సాధించి ఉండాలి.
» వయసు: 29.11.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: క్లాట్–2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 09.11.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 29.11.2023
» వెబ్‌సైట్: www.powergrid.in

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో 13 ఉద్యోగాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 13
» పోస్టుల వివరాలు: జిల్లా కోఆర్డినేటర్–1, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్–1, బ్లాక్ కోఆర్డినేటర్–11.
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
» వేతనం: నెలకు జిల్లా కోఆర్డినేటర్‌కు రూ.30,000. జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.18,000. బ్లాక్ కోఆర్డినేటర్‌కు రూ.20,000
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బాలసదన్ పక్కన, పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 10.11.2023.
» వెబ్‌సైట్: allurisitharamaraju.ap.gov.in

బెల్ బెంగళూరులో 16 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగళూరు కాంప్లెక్స్.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 16
» అర్హత: బీఈ, బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ /ఎలక్ట్రానిక్స్ /టెలికమ్యూనికేషన్/కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ /ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్).
» వేతనం: నెలకు రూ.40,000 నుంచి రూ.55,000 వరకు ఉంటుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 18.11.2023
» వెబ్‌సైట్: www.belindia.in

నంద్యాల జిల్లా మహిళా,శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయంలో 23 పోస్టులు

నంద్యాల జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 23
» పోస్టుల వివరాలు: జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్–01, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, లీగల్ కమ్ ప్రొటెక్షన్ ఆఫీసర్–01, కౌన్సిలర్–01, సోషల్ వర్కర్–02, అకౌంటెంట్–01, డేటా అనలిస్ట్–01, అసిస్టెంట్ కమ్ డేటాఎంట్రీ ఆపరేటర్–01, అవుట్‌రీచ్ వర్కర్స్–02, మేనేజర్/కోఆర్డినేటర్(మహిళలు)–01, సోషల్ వర్కర్ కమ్–ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్(మహిళలు)–01, నర్సు(మహిళలు)–01, డాక్టర్(పార్ట్‌టైమ్)–01, ఆయా(మహిళలు)–06, చౌకీదార్(మహిళలు)–01.
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంటర్,డిగ్రీ,పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బీఎస్‌ఎన్‌ఎల్ క్వార్టర్స్, బొమ్మలసత్రం, నంద్యాల చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 10.11.2023.
» వెబ్‌సైట్: nandyal.ap.gov.in

ఐఐఎంల్లో.. సమ్మర్ ప్లేస్‌మెంట్స్ హవా!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా ఐఐఎం! మేనేజ్‌మెంట్ విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ.. విద్యార్థులకు నిత్యనూతన నైపుణ్యాలు అందించడంలో.. ముందుండే ఇన్‌స్టిట్యూట్స్!! వీటిలో కోర్సులు పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ సంస్థల రెడ్ కార్పెట్ స్వాగతం ఖాయం అనే అభిప్రాయం! ఐఐఎంల్లో ఇటీవల సమ్మర్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ మొదలైంది! పలు సంస్థలు భారీ స్టయిఫండ్‌తో ఎస్‌పీఓలు ఖరారు చేస్తున్నాయి! ఈ నేపథ్యంలో.. ఐఐఎంల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ తాజా ట్రెండ్స్, అవకాశాలు కల్పిస్తున్న రంగాలు, స్టయిఫెండ్స్ తదితర వివరాలు..

» ఐఐఎంలలో మొదలైన ఎస్‌పీఓ ప్రక్రియ
» పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో వందశాతం ఆఫర్లు
» సగటున రూ.2 లక్షల స్టయిఫండ్



ఎంబీఏ స్పెషల్

కార్పొరేట్ సంస్థలకు ఐఐఎం విద్యార్థులు హాట్ కేక్స్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయా కంపెనీలకు అవసరమైన నిర్వహణ నైపుణ్యాలు ఐఐఎంల విద్యార్థుల్లో ఉంటాయని భావించడమే ఇందుకు నిదర్శనం. తాజాగా ఐఐఎంలలో కొనసాగుతున్న ఎస్‌పీఓ ప్రక్రియ, అందిస్తున్న ఆఫర్లే ఇందుకు నిదర్శనం అంటున్నారు నిపుణులు.

సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌గా

ఐఐఎం పీజీ ప్రోగ్రామ్‌ల్లో చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం పూర్తయ్యాక లభించే సెలవు రోజుల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్ చేస్తారు. అంతకు ముందు కంపెనీలు విద్యార్థులను ఇంటర్న్ ట్రైనీగా ఎంపిక చేసేందుకు ప్రత్యేక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నెగ్గిన విద్యార్థులకు సంస్థలు రెండు వారాల వ్యవధిలో ఇంటర్న్ ట్రైనీగా విధులు నిర్వహించడానికి అవకాశం కల్పిస్తాయి. ఇలా ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారికి స్టయిపండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందిస్తాయి. ఇది రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది.

అందరికీ ఆఫర్స్

- 2023–25 బ్యాచ్ విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ వెల్లువెత్తున్నాయి.
- ఐఐఎం–లక్నోలో మొత్తం 576 మంది విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించాయి. వీరికి సగటు స్టయిఫండ్ నెలకు రూ 1.31 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.5 లక్షలుగా నిలవడం గమనార్హం.
- ఐఐఎం–కోల్‌కతలో.. 466 మంది విద్యార్థులకుగాను అందరికీ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించడం విశేషం. వీరికి సగటు స్టయిఫండ్ రూ.1.65 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.75 లక్షలుగా ఉంది.
- ఐఐఎం–నాగపూర్‌లోనూ నూటికి నూరు శాతం విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. సగటు స్టయిఫండ్ రూ.79 వేలుగా ఉంది.

కొనసాగుతున్న ప్రక్రియ

దేశంలోని ఇతర ఐఐఎంలలోనూ ప్రస్తుతం సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐఎం–అహ్మదాబాద్, బెంగళూరు తదితర క్యాంపస్‌లలో ఈ నెల రెండో వారంలోపు ఈ ప్రక్రియ పూర్తవనుంది. ఇప్పటి వరకు లభించిన సమాచారం ప్రకారం–ఇతర ఐఐఎంలలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ దాదాపు వంద శాతం లభించే సంకేతాలున్నాయని ఆయా క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్, ఫైనాన్స్

- ఐఐఎంలు, ఇతర బి-స్కూల్స్‌లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌లో ఈ ఏడాది కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల హవా కనిపించింది. ఇప్పటి వరకు అన్ని బి–స్కూల్స్‌లో దాదాపు 40 శాతం మేర సమ్మర్ ప్లేస్‌మెంట్స్.. కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాలకు చెందిన సంస్థల నుంచే ఉన్నాయి. బీసీజీ, బెయిన్ అండ్ కో, యాక్సెంచర్ స్ట్రాటజీ, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, సినర్జీ కన్సల్టింగ్ కంపెనీలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి.
- కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల తర్వాత ఐటీ, ఈ–కామర్స్ సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా ఉన్నాయి. ఈ రంగాల్లో డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ చేసే విధంగా ఆఫర్లు లభించాయి. అదే విధంగా గూగుల్, ఫేస్‌బుక్ సంస్థలు కూడా ఎస్‌పీఓ ఆఫర్లు కల్పించాయి.

సేల్స్, అండ్ మార్కెటింగ్‌లోనూ

సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రొఫైల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్స్ జోరు కొనసాగింది. ముఖ్యంగా ప్రొడక్ట్ రీసెర్చ్, మార్కెట్ అనాలిసిస్ విభాగాల్లో విధులు నిర్వర్తించే విధంగా ఈ ఆఫర్స్ లభించాయి. అదే సమయంలో జనరల్ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ఖరారయ్యాయి. పలు సంస్థలు ఈ విభాగాల్లో విద్యార్థులను నియమించుకునే క్రమంలో విశ్లేషణాత్మక దృక్పథం, మార్కెట్ పరిస్థితులపై వారికున్న అవగాహనను క్షుణ్నంగా పరిశీలించి ఆఫర్స్ ఇచ్చినట్లు ఐఐఎంల వర్గాలు పేర్కొన్నాయి.

ఈ ప్రొఫైల్స్‌లో అధికంగా

సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో ఎక్కువగా డేటా మేనేజ్‌మెంట్; ఫైనాన్స్ మేనేజ్‌మెంట్; జనరల్ అడ్మినిస్ట్రేషన్; సేల్స్ అండ్ మార్కెటింగ్; డేటా అనలిటిక్స్; బిజినెస్ స్ట్రాటజీస్ ప్రొఫైల్స్ ముందంజలో ఉంటున్నాయి.

ఎందుకంత క్రేజ్

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ పేరిట కంపెనీలు ఐఐఎంల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఆఫర్స్, రూ.లక్షల్లో స్టయిపండ్ ఇవ్వడానికి కారణం ఏంటి? అంటే వినిపిస్తున్న సమాధానం.. ఈ ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు రియల్ టైమ్ నైపుణ్యాలు, అప్‌డేటెడ్ నాలెడ్జ్ ఉంటుందని ఆయా సంస్థలు భావించడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక్కడ బోధన విధానాలు అత్యున్నత స్థాయిలో ఉంటాయి. విద్యార్థులను కార్పొరేట్ లీడర్లుగా తీర్చిదిద్దే విధంగా కరిక్యులం ఉంటుంది. అందుకే ఈ ఇన్‌స్టిట్యూట్స్ నుంచి ఇంటర్న్ ట్రైనీలను నియమించుకునేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంటున్నారు.

పూర్తిస్థాయి కొలువుకు మార్గం

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ ట్రైనింగ్ సమయంలో విద్యార్థులు చూపే పనితీరు ఆయా సంస్థల్లో పూర్తి స్థాయి కొలువుకు మార్గంగా నిలుస్తుంది. ఎస్‌పీఓ దక్కించుకున్న అభ్యర్థులు ట్రైనీగా ప్రతిభ చూపితే.. అదే సంస్థలో శాశ్వత నియామకం సొంతం చేసుకునే అవకాశం కూడా ఉంది. ఇంటర్న్‌షిప్ చేసిన సమయంలో తమకు కేటాయించిన విధులు, విభాగాల్లో తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను ప్రదర్శించిన వారికి కంపెనీలు ముందుగానే ఆఫర్స్ ఖరారు చేస్తున్నాయి. ఇలాంటి అభ్యర్థులకు ద్వితీయ సంవత్సరం చివర్లో నిర్వహించే ఫైనల్ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియల్లో పాల్గొనకుండానే ఫైనల్ ఆఫర్ లభిస్తుంది.

ఫైనల్ ప్లేస్‌మెంట్స్

ప్రస్తుతం సమ్మర్ ప్లేస్‌మెంట్ ట్రెండ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఫైనల్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ కూడా ఆశాజనకంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంస్థల వ్యాపారాలు పుంజుకుంటున్నాయని, అవి తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకు అవసరమైన స్కిల్స్ ఉన్న వారిని నియమించుకునేందుకు ప్లేస్‌మెంట్స్‌కు వస్తున్నాయని చెబుతున్నారు.

ఇతర బి-స్కూల్స్‌లోనూ

ఐఐఎంలతోపాటు దేశంలోని ఇతర ప్రముఖ బి–స్కూల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ ఆశాజనకంగా ఉండనున్నాయి. అలాగే మరో ప్రముఖ బీస్కూల్ ఎక్స్ఎల్ఆర్ఐ–జెంషెడ్‌పూర్‌లోనూ వంద శాతం ఇంటర్న్‌షిప్ ఆఫర్లు లభించాయి. అంతేకాకుండా రెండు నెలల వ్యవధికి ఇచ్చే స్టయిపండ్ కూడా గరిష్ఠంగా రూ.3.5 లక్షలుగా నమోదవడం విశేషం. అదే విధంగా ఢిల్లీ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలోనూ ఎంబీఏ విద్యార్థులకు బెస్ట్ ఆఫర్లు లభిస్తాయని భావిస్తున్నారు.